


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 3-7-2025

సంపుటి: 21 సంచిక: 86
పేజీలు: 8 వెల: రూ.1

జిల్లాలోని సచివాలయాల్లో పని చేస్తున్న సర్వేయర్లు విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సచివాలయాల్లోని మిగతా ఉద్యోగుల బదిలీలు పూర్తయినా, రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ఉద్యోగుల బదిలీలు కూడా పూర్తయినా జిల్లాలో మాత్రం ప్రారంభమే కాలేదు. గత నెల 30 నాటికి ఐదేళ్లు పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగులందరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటికి అనుగుణంగా ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి చేసినా సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ల బదిలీలు జరగకపోవడానికి ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లోపమే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


మహిళా పోలీసుల కౌన్సిలింగ్‌లో పాల్గొన్న ఎస్పీ (ఫైల్‌ఫోటో)

- ★ సెలవుపై వెళ్లిపోయిన సర్వే శాఖ ఏడీ
- ★ కౌన్సెలింగ్ షెడ్యూల్‌తో కలెక్టర్‌కు నోట్‌ఫైల్ పంపిన ఇన్‌ఛార్జి
- ★ తనకు చెప్పకుండా ఎలా పంపారని జేసీ ఆగ్రహం
- ★ బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశాలు
- ★ ఇతర సచివాలయ ఉద్యోగుల్లో పారదర్శకతకు పాతర




## సమన్వయ లోపం

# సర్వేయర్ల బదిలీల్లో సందిగ్ధం!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా సర్వే శాఖ ఏడీ విజయ్‌కుమార్ అనకాపల్లికి బదిలీ చేయించుకున్నారు. ఆయన స్థానంలో విధుల్లో చేరాల్సిన అనకాపల్లి ఏడీ గోపాల్‌రాజ అక్కడ ఇంకా రిలీవ్ కాలేదు. అందువల్ల అక్కడికి బదిలీ అయిన విజయకుమార్‌ను జాయింట్ కలెక్టర్ రిలీవ్ చేయ లేదు. దాంతో ఇప్పటికే నెల రోజుల సెలవులో ఉన్న ఏడీ విజయ్‌కుమార్ దాన్ని మరో నెల పొడిగించి వెళ్లిపోవడంతో సర్వేశాఖ రమేష్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది నిర్వహించిన గ్రామ సర్వేయర్ల బదిలీల్లో విజయకుమార్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. బదిలీలను కావాలనే జాప్యం చేసి భాను అనే సర్వేయర్ ద్వారా అందినకాడికి దండుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫలితంగా గత సెప్టెంబర్‌లో జరగాల్సిన బదిలీలను ఈ ఏడాది జనవరి వరకు సర్దుబాటు పేరుతో కొనసాగిస్తూ వచ్చారు. మొదటి నుంచి ఏడీ విజయకుమార్ పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నారు. దీన్ని గ్రహించిన విజయకుమార్ అనకాపల్లికి చెందిన అధికార కూటమి ప్రజాప్రతినిధి సిపార్సుతో ఆ జిల్లాకు బదిలీ చేయించుకున్నారు. అయితే అక్కడి అధికారి రిలీవ్ కాకపోవడాన్ని కారణంగా చూపి ఇక్కడ ఈయన్ను రిలీవ్ చేయకపోయినా సెలవు పెట్టి వెళ్లిపోయారు.

### ఇన్‌ఛార్జి ఏడీపై జేసీ ఫైర్

వాస్తవానికి జూన్ 30 నాటికి సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే ఈ నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఉండటంతో అది పూర్తి చేశాకే బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు పింఛన్ల పంపిణీ పూర్తి అయిన తర్వాత ఆ రోజు రాత్రి 10 గంటల నుంచి సర్వేయర్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం సాయంత్రం నాటికి ప్రక్రియ పూర్తిచేసి పాత తేదీలతో బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇంతలో ఇన్‌ఛార్జి ఏడీ రమేష్‌ను జేసీ తన ఛాంబర్‌కు పిలిపించి రెండో తేదీ బుధవారం శాఖాపరంగా చేయాల్సిన పనులపై చర్చించారు. అయితే అదేరోజు బదిలీల కౌన్సెలింగ్ ఉన్నందున సర్వేయర్లు విధులకు రారని ఇన్‌ఛార్జి ఏడీ వివరించారు. దానికి జేసీ స్పందిస్తూ బదిలీ ప్రక్రియ జూన్ 30 నాటికే పూర్తి కావాలి కదా..! ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. కలెక్టర్‌కు నోట్‌ఫైల్ పెట్టి ఆమోదం కోసం ఎదురుచూశామని ఏడీ రమేష్ సమాధానం ఇవ్వగా తన పరిధిలో ఉన్న సర్వే శాఖలో బదిలీలపై కలెక్టర్‌కు నోట్‌ఫైల్ ఎందుకు పెట్టారని జేసీ నిలదీసినట్లు తెలిసింది. తనకు చెప్పకుండా, తన ఆమోదం లేకుండా కలెక్టర్‌కు నోట్‌ఫైల్ ఎలా పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసి కౌన్సెలింగ్ నిలిపేయాలని జేసీ ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాంతో సర్వేశాఖ పరిధిలోని గ్రామ సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ల బదిలీలు నిలిపేస్తున్నట్టు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో సచివాలయాలకు సమాచారం ఇచ్చారు. అయితే గత నెల 30 నుంచి బదిలీలపై బ్యాన్ విధించారు కాబట్టి ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేయరాదని జేసీ సర్వేశాఖ అధికారులకు సూచించారు. జేసీ ఆదేశాల గురించి సర్వేశాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఇంతవరకు నిర్ణయం వెలువడలేదని సర్వే శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధుల ఒత్తిడి

కలెక్టర్, జేసీ పరస్పరం మాట్లాడుకుని గురువారం ఉదయం నుంచైనా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తారేమోనని ఎదురు చూసిన సర్వేయర్లకు నిరాశే మిగిలింది. జిల్లాలో 585 మంది సర్వేయర్లు ఉండగా 377 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 217 మంది ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారు ఉన్నారు. కాగా 270 మంది గ్రామ సర్వేయర్లు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఈ లేఖలతో పాటు ఎక్సెల్ షీట్‌లో దరఖాస్తుదారుల జాబితా తెప్పించుకుని తాము సిఫార్సు చేసిన వారిని వారు కోరిన చోటుకే బదిలీ చేయాలని.. ఒక్కరు మిస్ అయినా బాగుండదని పలువురు ప్రజాప్రతినిధులు ఏడీని హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం.

### ఉత్తర, దక్షిణలు ఉన్నవారికే ప్రాధాన్యం

మొదట రేషనలైజేషన్ చేసిన తర్వాత బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలి. అలా చేయకుండా ఆయా శాఖల అధికారులు తమకు నచ్చినట్టు చేసి చేతులు దులుపుకున్నారు. పోలీసు శాఖ పరిధిలో ఉన్న సచివాలయాల్లోని మహిళా - మిగతా చివరి పేజీలో

## దూసి రోడ్డు..

# నరకానికి బోర్డు





- ★ అధ్వానంగా పల్లె రోడ్డులు
- ★ కష్టసాధ్యంగా మారిన ప్రయాణం
- ★ ఈసురోమంటు రాకపోకలు
- ★ అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి
- ★ ఇసుక వాహనాలే కారణమంటున్న ప్రజలు
- ★ పట్టించుకొని ప్రజాప్రతినిధులు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

సుమారు 11 గ్రామాలను కలుపుతున్న ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలోని కొత్తవలస నుంచి రాగోలు వద్ద పాలకొండ–శ్రీకాకుళం రోడ్డులో కలిసే దూసి అడ్డురోడ్డు వరకు సుమారు 12 కిలోమీటర్లు పొడవున ఉన్న రోడ్డు గోతులు, మురుగుతో అధ్వానంగా తయారైంది. పది రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు రోడ్డుపై రాకపోకలు సాగించలేక 11 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక తరలించే భారీ వాహనాల రాకపోకలతో రేయింబవళ్లు నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై సాధారణ వాహనాల రాకపోకలు కష్టసాధ్యంగా - మిగతా చివరి పేజీలో



## విశాఖకు మరో మణిహారం

# అణు జలాంతర్గాముల స్థావరం

- ⏭ రాంబిల్లి వద్ద ఐఎన్ఎస్ వర్షాకు తుది మెరుగులు
- ⏭ వచ్చే ఏడాది తొలి దశ నిర్మాణం అందుబాటులోకి
- ⏭ దేశంలోనే తొలి ఆటమిక్ సబ్‌మెరైన్ కేంద్రం
- ⏭ విశాఖ తీరంపై ఒత్తిడి తగ్గించేందుకు అవకాశం
- ⏭ కేంద్ర ప్రభుత్వ లుక్ ఈస్ట్ పాలసీలో ఇదో భాగం


డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

సాగరతీరంలో ఉన్న విశాఖ మహానగరం ఇప్పటికే రక్షణపరంగా అత్యంత వ్యూహాత్మకం, కీలక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ నగరానికి మరింత ప్రాముఖ్యత చేకూర్చేలా చేపట్టిన అణు నౌకా స్థావం నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. త్వరలో అందుబాటులోకి రానుంది. విశాలమైన మనదేశ తూర్పు తీరాన్ని, బంగాళాఖాతంపై మన ప్రాదేశిక ఆధిపత్యాన్ని పరిరక్షించడంతోపాటు ఇతర దేశాలు, ఉగ్రవాదుల చొరబాట్ల నుంచి రక్షించేందుకు వీలుగా ఇప్పటికే విశాఖ ప్రధాన కేంద్రంగా కొన్ని దశాబ్దాలుగా తూర్పు నావికాదళం పని చేస్తోంది. దీంతోపాటు హిందుస్తాన్ షిప్‌యార్డు పేరుతో నౌకా నిర్మాణ కేంద్రం, నౌకలకు మరమ్మతులు చేసే డాక్‌యార్డులతో పాటు నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ).. అంటే నేవీ ఆయుధాగారం, భీమిలి సమీపంలో క్షపణుల కేంద్రం.. ఐఎన్ఎస్ కళింగ, అలాగే డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు అనుబంధంగా నేవల్ సైంటిఫిక్ అండ్ టెక్నలాజికల్ లేబరేటరీ(ఎన్ఎస్‌టీఎల్) తదితర సంస్థలు విశాఖకు రక్షణపరంగా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టాయి. ఇప్పుడు వీటికి అదనంగా అణు జలాంతర్గాములు ప్రధాన కేంద్రం విశాఖ సిగలో మరో మణిహారంగా చేరనుంది. ఇది దేశంలోనే తొలి అణు జలాంతర్గాముల కేంద్రం కావడం విశేషం.

### విశాఖ పోర్టుపై ఒత్తిడి తగ్గించేలా..

ప్రస్తుతం విశాఖ తీరంలో తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రంతోపాటు విశాఖపట్నం పోర్టు, గంగవరం ప్రైవేట్ పోర్టు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పోర్టుకు వచ్చే వాణిజ్య నౌకలతో పాటు నేవీకి చెందిన యుద్ధ, గస్తీ, నిఘా నౌకలు ఈ తీరానికి వస్తుంటాయి. వాణిజ్య నౌకలకు సంబంధించి వన్‌టౌన్ ఏరియాలోని తీరంలో నౌకలను నిలిపే బెర్తులు ఉండగా, నేవీ నౌకలు నిలపడానికి డాక్‌యార్డు సమీపంలో ప్రత్యేక బెర్తులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడే అణు జలాంతర్గాములను కూడా





నిలుపుతున్నారు. ఈ క్రమంలో విశాఖ తీరంపై ఒత్తిడి పెరిగిపోతోంది. 2006లో తూర్పు నావికా దళం వద్ద 15 యుద్ధనౌకలు ఉండగా.. 2012 నాటికి వాటి సంఖ్య 46కు పెరిగింది. పెద్దసంఖ్యలో రాకపోకలు సాగించే నౌకల కారణంగా జలమార్గంలో రద్దీ తీవ్రతరమైంది. బెర్తులు సరిపోని పరిస్థితి తలెత్తింది. నిర్వహణ కష్టాలు పెరుగుతున్నాయి. ఈ రద్దీని తగ్గించేందుకు విశాఖ నుంచి 200 కి.మీ. రేడియస్‌లో మరో నౌకాస్థావరాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లుక్ ఈస్ట్ పాలసీలో భాగంగా 2005లోనే నిర్ణయించారు. ఆ మేరకు ప్రాజెక్టు వర్షా పేరుతో భారత నేవీ, కేంద్ర నౌకారవాణా శాఖ సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించాయి.

### రాంబిల్లిలో కొత్త స్థావరం

ఈ ప్రణాళికల్లో భాగంగా విశాఖ తీరానికి దక్షిణంగా ఉన్న గంగవరం తీరం వద్ద ప్రైవేట్ రంగంలో గంగవరం వాణిజ్య పోర్టు ఏర్పాటు చేశారు. ఇక నేవీకోసం తగిన వ్యూహాత్మక ప్రదేశం కోసం చాన్నాళ్లు అన్వేషణ సాగించి చివరికి విశాఖకు 50 కి.మీ. దూరంలో ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ఉన్న రాంబిల్లి తీరాన్ని అనువైనదిగా గుర్తించి అణునౌకా స్థావరం నిర్మాణానికి ఎంపిక చేశారు. విశాఖలోని తూర్పు నావికా దళ కేంద్రానికి సమీపంలోనే ఉన్న ఈ స్థావరం దాని ఆధీనంలోనే పని చేస్తుంది.

### 15 ఏళ్లుగా కొనసాగుతున్న ప్రాజెక్టు

రెండు దశల్లో చేపట్టాలని ప్రతిపాదించిన ఐఎన్ వర్షా మొదటి దశ నిర్మాణ పనులు 2011-12 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. తొలి దశలో సివిల్, ఇతర నిర్మాణాలు బెర్తుల నిర్మాణం వంటివి 2022లోనే పూర్తి కావాల్సి ఉంది. కానీ కరోనా కారణంగా చాలా కాలం పనులు నిలిచిపోవడంతో జాప్యం జరిగింది. ఈ మొదటి దశ నిర్మాణమే ఇప్పుడు తుది దశకు చేరుకుంది. వచ్చే ఏడాది దీన్ని జాతికి అంకితం చేసి అందుబాటులోకి తెచ్చేందుకు నేవీ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు రెండో దశలో ప్రతిపాదించిన సాంకేతిక పనులు, కమాండ్ సెంటర్ అణు జలాంతర్గాములు, అణు క్షపణులకు సంబంధించి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి) కేంద్రం నిర్మాణాలు 2018లో ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయి.

### రాంబిల్లి ఎంత రహస్యంగా ఉంటుంది?

రాంబిల్లి వ్యూహాత్మకంగా చాలా సురక్షిత ప్రాంతం. హైనాన్ దీవిలో ఉన్న చైనాకు చెందిన అణు నౌకా స్థావరం మాదిరిగానే ఉంటుంది. ఇక్కడ సముద్రతీరం లోతుగా ఉండటం వల్ల ఈ జలాల్లో నిలిచే జలాంతర్గాములు శత్రువుల నిఘాకు దొరకవు. శాటిలైట్ కళ్లకు కూడా కనిపించకుండా బయటకు రావచ్చు, లోపలికి వెళ్లవచ్చు. అణ్వాయుధాలను మోసుకెళ్లే సూపర్ సానిక్ బాలిస్టిక్ మిసైల్ సబ్‌మెరైన్స్‌కు ఇటువంటి గోప్యత చాలా అవసరం. ఈ స్థావరంలోనే భూగర్భ గదులు, సొరంగాలు నిర్మించి అణు జలాంతర్గాములను అక్కడే కనిపించకుండా నిలిపి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ స్థావరం కేంద్రంగా భవిష్యత్తులో స్టెల్త్ ఆపరేషన్లు నిర్వహించవచ్చు. భారత నావికాదళం వద్ద ప్రస్తుతం అరిహంత్ రేంజ్ అణు జలాంతర్గాములు ఉన్నాయి. ఈ శ్రేణిలో మొదటిది అరిహంత్ కాగా రెండోది అరిఘాత్.. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న మూడో అణు సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ అరిధామన్ తుది రూపరేఖలు దిద్దుకుంటోంది. ఈ ఏడాదిలోనే దాన్ని జలప్రవేశం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అరిహంత్, అరిఘాత్‌ల కంటే అరిధామన్ పెద్దది. ఏడువేల టన్నుల బరువుతో 3500 కి.మీ. రేంజ్ ఉన్న కే-4 మిస్సైల్స్ 'క్షిపణులు)ను మోసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. ఇవి కాకుండా భవిష్యత్తు మరో ఆరు అణు సబ్‌మెరైన్లు సమకూర్చుకోవాలని భారత నేవీ సంకల్పించింది. ఇవన్నీ రాంబిల్లిలో ఏర్పాటు చేస్తున్న ఐఎన్ఎస్ వర్షా ప్రధాన కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తాయి.

• ఎడిటోరియల్

# గ్లోబల్ బంగారు కొండ.. భారత్!

ప్రపంచ ఆర్థిక రంగాన్ని శాసించేది బంగారమేననడంలో సందేహం లేదు. ఎందుకంటే ఒక్కో దేశానికి ఒక్కో రకమైన కరెన్సీ ఉంటుంది. అది ఆ దేశంలో తప్ప ఇతర దేశాల్లో చెల్లదు. అందువల్ల విదేశీ పర్యటనలకు వెళ్లేవారు, విదేశీ వాణిజ్యం చేసేవారు మన కరెన్సీని ఆయా దేశాల కరెన్సీగా మార్చి చెల్లించడమో లేదా డాలర్లలోకి మార్చి ఇవ్వడమో చేయాల్సి ఉంటుంది. ఇలా కరెన్సీ ఎక్స్ఛేంజ్ కు చాలాచోట్ల కమీషన్లు చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా డాలర్‌తో స్థానిక కరెన్సీ మారకం రేట్లు చాలా తేడాగా ఉండి ఆయా దేశాలకు, వ్యక్తులకు నష్టం కలగజేస్తుంటాయి. దీనికి ఉన్న ఒకే ఒక్క విరుగుడు బంగారం. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం క్రయవిక్రయాలు జరుగు తుంటాయి. అందువల్లే దాదాపు అన్ని దేశాలు విదేశీ మారక ద్రవ్యంతో పాటు అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు వీలుగా భారీగా బంగారం నిల్వలను కూడా మెయింటైన్ చేస్తుంటాయి. ఆ క్రమంలో మన భారత దేశంలో రిజర్వ్ బ్యాంక్ వద్ద కూడా 879.58 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. ఈ కారణాల వల్ల సహజంగానే బంగారం ధరలు ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్నాయి. కొద్దిరోజులు తగ్గినా మళ్లీ అంతలోనే పైకి ఎగబాకుతున్నాయి. దీనికితోడు మన దేశప్రజలకు బంగారంపై మోజు అంతా ఇంతా కాదు. శుభకార్యాలకు తోడు ఏ చిన్న అవకాశం దొరికినా బంగారం కొనడానికే భారత మహిళలతో పాటు ఇటీవలి కాలంలో పురుషులు కూడా మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా భారత ప్రభుత్వం వద్ద ఉన్న బంగారం నిల్వల ఎన్నో రెట్లు అధిక నిల్వలు ప్రజల ఇళ్లలోనూ, దేవాలయాల ట్రెజరీల్లోనూ ఉన్నాయని ఒక అంచనా. ఆ లెక్క ప్రకారం దేశంలో ఏకంగా 25 వేల టన్నులు అంటే.. 2.50 కోట్ల కిలోల బంగారం ఉండవచ్చంటున్నారు. దీని విలువ అక్షరాలా రూ.200 లక్షల కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర జీడీపీ అంచనాల్లో ఇది 56 శాతం. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ కంటే ఆరు రెట్లు ఎక్కువ. అంతే కాదు.. ప్రపంచంలోని ప్రైవేట్ గోల్డ్ నిల్వల్లో 14 శాతం వాటా భారతదేశానిదే. ఈ లెక్కన భారత్‌ను గ్లోబల్ బంగారు కొండ అనవచ్చేమో! 2020 నుంచి బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఏడాది కాలంగా మరింతగా భగ్గుమంటున్నాయి. పది గ్రాముల పసిడి ధర లక్ష దగ్గరగా ఉంది. ఈ ధర వింటే మధ్యతరగతి ప్రజల గుండెలు గుభేల్‌మంటుంటే.. దిగువ మధ్యతరగతివారు బంగారం షాపుల వైపే చూడ్డం మానేశారు. పెళ్లిళ్లు వంటి శుభకార్యాలప్పుడు తప్పనిసరి కావడంతో తులమో అరతులమో కొనడంతో సరిపెట్టుకుంటున్నారు. అయినా కొనుగోళ్లు తగ్గడం లేదు. ఈ లోటు ఎగువ మధ్యతరగతి, సంపన్నవర్గాలు భర్తీ చేస్తున్నాయి. గత ఏడాది మన దేశంలో బంగారం డిమాండ్ ఏకంగా 782 టన్నులకు చేరింది. కరోనాకు ముందున్న సగటు అమ్మకాల కంటే ఇది 15 శాతం ఎక్కువ. ఆర్నమెంట్ బంగారం డిమాండ్ కాస్త మందగించినా.. బంగారం కడ్డీలు, కాయిన్లలో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గడంతో బంగారంపై రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్లు బాగా పెరిగాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి మన దేశంలో బంగారం డిమాండ్ 725 టన్నులకు చేరుతుందన్నది యూబీఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ అంచనా. 2026 తర్వాత కాస్త నెమ్మదించినా గోల్డ్ డిమాండ్ 800 టన్నుల వద్ద స్థిరపడవచ్చని అంచనా. దేశంలోని ప్రైవేట్ బంగారు నిల్వలు ఏటా సగటున ఎనిమిది వేల టన్నులు పెరుగుతున్నట్లు ఈ సంస్థ అంచనా వేసింది. ఇళ్లలో ఉన్న బంగారంలో రెండు శాతం కంటే తక్కువ మాత్రమే తనఖా కోసం బయటకు వస్తోంది. మిగతాదంతా బీరువాలు, రహస్య ట్రెజరీలు, బ్యాంకు లాకర్లలో మూలుగుతోంది. ఈ నిల్వలను బయటకు తెచ్చే ప్రయత్నంగా ఆర్థిక సంస్థలు గోల్డు లోన్లపై వడ్డీలు తగ్గించినా లాభం లేకపోతోంది. దీనికి కారణం.. భారతీయులు బంగారాన్ని ఆస్తిగానే కాకుండా ప్రతిష్టకు సంబంధించినదిగా చూస్తారు. బంగారు నగలతో ఎమోషనల్ అనుబంధం పెంచుకుంటారు. అందువల్ల తప్పనిసరైతే తప్ప తాకట్టు పెట్టడానికి, అమ్మడానికి ఇష్టపడరు. ఈ కారణంగానే గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్, సావరిన్ గోల్డ్ బాండ్స్ లాంటి పథకాలేవీ పెద్దగా సక్సెస్ కావడం లేదు. అందువల్ల దేశంలో ప్రభుత్వం వద్ద ఉన్న నిల్వలకు అదనంగా మరో పాతిక వేల టన్నుల బంగారం ఉన్నా అది పూర్తిగా ప్రైవేట్ ఆస్తి. దాన్ని జాతీయ సంపదగా చెప్పలేం. గోల్డ్ కంట్రోల్ యాక్ట్ వంటివి సక్రమంగా అమలుకాక పౌరుల వద్ద బంగారం నిల్వలు అపరిమితంగా పెరిగిపోతున్నాయి.



## ప్రియుడి లక్ష్యం కోసం..

జూలై మాసం వచ్చిందంటే కన్వర్ యాత్రీకులతో ఉత్తరాదిలో ఒక ఆధ్యాత్మిక కోలాహలం కనిపిస్తుంటుంది. ప్రతీ ఏటా జూలై మాసంలో ప్రారంభమయ్యే ఆ తీర్థయాత్రలో కన్వారియాలుగా.. లేదా, శివభక్తులుగా పిలువబడేవారు లక్షలాదిమంది పాల్గొంటారు. తమ మొక్కులు తీర్చుకునే క్రమంలో హరిద్వారా, గోముఖ్, గంగోత్రి వంటి పవిత్రస్థలాలకు కాలిబాటన వెళ్తుంటారు. ఆయా ప్రాంతాల్లోని నదుల నుంచి, ముఖ్యంగా గంగానది నుంచి తీసుకొచ్చే పవిత్రజలాలను తమ స్థానిక ఆలయాల్లోని శివుడిపై అభిషేకిస్తుంటారు. ఇది ప్రతీ ఏటా కనిపించే ఓ ఆచారం అక్కడ. దాదాపు ఇలాంటి సంప్రదాయమే తెలంగాణా ప్రాంతంలోని కొన్ని టెంపుల్ టౌన్స్‌లోనూ కనిపిస్తుంది. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి సమాజం ఆకలి తీరాలన్న ఓ సమున్నతమైన ఆకాంక్షతో.. గోపాలకాలాల పేరుతో శివుడికి అభిషేకాలు చేసి, భజనలు చేస్తూ స్థానిక నదుల్లో స్నానం చేయడం కనిపిస్తుంటుంది. అలాంటి ఈ కన్వర్ యాత్రలో అంతకంటే ఒక విశేషమైన కథను మనం ఇప్పుడు చెప్పుకోబోతున్నాం.

# ప్రియురాలి పాదయాత్ర

ఉత్తరప్రదేశ్ లోని మీరట్ జిల్లా సహరాన్ పూర్ డివిజన్ నుంచి ఒక అమ్మాయి కూడా కన్వారియాగా మారి 140 కిలోమీటర్ల ప్రయాణాన్ని కాలినడకన చేసింది. తమ మొక్కులు తీర్చుకునేందుకే ఈ కన్వర్ యాత్ర చేపట్టే భక్తుల సంఖ్య అధికంగా కనిపించే క్రమంలో.. మనం చెప్పుకోబోతున్న లక్ష్మి ప్రయాణం కూడా అటువంటిదే. కానీ, ఆ మొక్కులోనే కొంత భిన్నమైన కథా మనకు కనిపిస్తుంది.

### భక్తిని మించిన ప్రేమ లక్ష్మిది!

మీరట్ జిల్లాలోని పార్థాపూర్ లక్ష్మి స్వగ్రామం. తన గ్రామం నుంచి హరిద్వార్ వంటి ప్రాంతానికి ఏకంగా 140 కిలోమీటర్ల ప్రయాణాన్ని లక్ష్మి చేపట్టడం వెనుక కేవలం ఆమె భక్తి మాత్రమే లేదు.. తన ప్రియుడు అనుకున్నది సాధించాలన్న ఆకాంక్ష ఉంది. అందుకే తన స్నేహితురాలు మాన్సీతో కలిసి మొక్కు కోసం నడక ప్రారంభించింది లక్ష్మి. ఇంతకీ ఏం మొక్కంటారా..? ఆర్మీలో ఉద్యోగం సంపాదించాలన్నది లక్ష్మి ప్రియుడి తపన. ఇప్పటికే ఏడాది నుంచి ఆ సెలక్షన్స్ కోసం లక్ష్మి ప్రియుడు కష్టపడుతున్నాడు. కాబట్టి, తను విజయం సాధించాలని తన ప్రియుడి కోసం మొక్కుకున్న మొక్కది.

తన మొక్కులో భాగంగా హరిద్వారా గంగాతీరం నుంచి సేకరించిన పవిత్రమైన ఆ జలాన్ని ఆ ఝటాజూటుడిపై అభిషేకిస్తే తన ప్రియుడి కోరిక నెరవేరుతుందన్నది లక్ష్మి అచంచల విశ్వాసం.

### ప్రేమకోసం ఆధ్యాత్మిక మార్గం!

లక్ష్మి తన కాలిబాటన ప్రయాణించి.. తాను సేకరించిన 81 లీటర్ల గంగాజలాన్ని తమ వెంట తెచ్చుకున్న పాత్రలతో మీరట్ లోని తన స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. అలాగే, తిరుగు ప్రయాణంలోనూ లక్ష్మి, తన ఫ్రెండ్ మాన్సీ ఇద్దరూ మొక్కవోని దృఢసంకల్పంతోపాటే, లక్ష్మి ప్రేమకథ విని చలించిన సాటి పాద యాత్రీకుల ఆశీర్వాదాలతో తమ ప్రయాణాన్ని విజయవంతంగా ముగించారు.

### లక్ష్మి పంథాకు సమాజం నుంచి ప్రశంసల జల్లు!

లక్ష్మి కథ విన్న ముజఫర్‌నగర్ వాసులు పెద్దఎత్తున గుమ్మిగూడి ఆమెకు స్వాగతం పలికారు. స్థానిక శివచౌక్ ఆమెను ప్రోత్సహించే వారితో కిక్కిరిసిపోయింది. అలిసిపోయి వస్తున్న లక్ష్మికి స్థానికులు వివిధరకాల ఫలహారాలందించారు. ఆమెపైన పువ్వుల వర్షం కురిసింది. తన ప్రియుడి కోసం ఆమె కనబర్చిన అంకితభావం ప్రశంసలందుకుంది. మొత్తంగా ప్రేమ, భక్తి సమ్మితమైన లక్ష్మి ఆధ్యాత్మిక ప్రయాణం తన 140కిలోమీటర్ల నడక అలసటను మరిపించే ఓ వేడుకగా మారింది. అప్పటివరకూ తాను తన ప్రియుడి ప్రేమకోసం భక్తితో చేపట్టిన ఆధ్యాత్మిక యాత్ర కాస్తా.. తనకు సమాజం నుంచి లభించిన మద్దతుతో ఒకింత భావోద్వేగంతో పాటు, ఏ లక్ష్యం కోసమైతే తాను పాద యాత్ర చేపట్టిందో ఆ లక్ష్యం చేరుకుంటానన్న ఒక చిన్న ఆశను కూడా రేకెత్తించింది.

### శివరాత్రి రోజు గంగాజల సమర్పణకు ప్లాన్!

పాదయాత్రగా వెళ్లి తాను సేకరించిన గంగాజలాన్ని తన స్వగ్రామమైన పార్థాపూర్ లోని శివాలయంలో తన దోసిటతో ఆ శివయ్యను అభిషేకించాలని నిర్ణయించుకుంది. తన ప్రియుడు పెట్టుకున్న లక్ష్యం నెరవేరాలని.. తాను భారత సైన్యంలో చేరి సేవలందించే కల సాకారం కావాలని అభిషేకిస్తూ ఆ శివయ్యను ప్రార్థించాలనేది ఇప్పుడు లక్ష్మి మొక్కులో ఆలోచన. అయితే, లక్ష్మి మొక్కు ఆదిలోనే చెప్పుకున్నట్టు.. కేవలం ఆ శివుడిపైనో, దేవుడిపైనో విశ్వాసం వరకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రేమ, విశ్వాసం, ఆశ అనేవి క్లిష్టతరమైన మార్గాల్లో కూడా ప్రయాణించేందుకు ఎలా దోహదం చేస్తాయో చెప్పుకోవడానికి ఈ లక్ష్మి కథ ఓ నిదర్శనం.

**- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..**



## ఔను..! వాళ్లిద్దరు 35 ఏళ్ళ తర్వాత

# మళ్ళీ కలిసిపోయారు!

**బాలీవుడ్‌ను కొన్ని దశాబ్దాల పాటు ఏకచత్రాధిపత్యంగా ఏలిన ఫ్యామిలీలలో కపూర్ ఫ్యామిలీ ఒకటి ! చిత్ర నిర్మాణం, నటన, దర్శకత్వాలలో కపూర్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన సందర్భాలు ఉన్నాయి కపూర్ ఫ్యామిలీ గురించి చెప్పుకోవాలంటే మొదటగా రాజ్‌కపూర్ గురించి చెప్పుకోవాలి. బాలీవుడ్‌లో కొన్నేళ్లు రాజ్‌కపూర్ శకం నడిచింది. చిత్ర నిర్మాతగా, దర్శకుడిగా , నటుడిగా విభిన్న రంగాల్లో రాజ్‌కపూర్ సక్సెస్ అయ్యారు. ఆ రాజ్‌కపూర్ కొడుకులే రణధీర్‌కపూర్, రిషికపూర్, రాజీవ్‌కపూర్.**

ప్రేమకథా చిత్రాలకు పెట్టింది పేరు కపూర్ సినిమాలు. లవ్‌స్టోరీ సినిమాల్లో హీరోగా నటించి సక్సెస్ అయిన రణధీర్‌కపూర్‌కు నిజ జీవితంలో కూడా ఓ లవ్‌స్టోరీ ఉంది. రాజ్‌కపూర్ సినిమా సంగమ్ షూటింగ్‌లోనే రణధీర్ కపూర్ బబితను చూసి ప్రేమించాడు. ఆ ప్రేమ పార్కులు పాటలు షికార్లు తిరిగి ఫైనల్‌గా పెద్దల ఆమోదంతో పెళ్లి దాకా వచ్చింది. ఇరువైపులా పెద్దలు అంగీకరించడంతో 1971 నవంబర్‌లో వారిద్దరి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కరీనా కపూర్, కరిష్మా కపూర్. కొంతకాలం అన్యోన్యంగా గడిచిన రణధీర్ కాపురంలో క్రమేపీ కలతలు మొదలయ్యాయి. ఆఖరికి 1988 లో రణధీర్‌కపూర్ బబిత నుంచి విడిపోయాడు. అయితే అధికారికంగా విడాకులు మాత్రం ఇవ్వలేదు. కరీనా, కరిష్మాలు తల్లి దగ్గరే పెరిగి బాలీవుడ్‌లో సక్సెస్ఫుల్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నారు.

తిరిగి ఇన్నేళ్లకు పిల్లల చొరవతో రణధీర్ దంపతులు కలిసిపోయారు. ఈ నేపథ్యంలో కరీనా బార్ఖాదత్‌లో మాట్లాడుతూ '35 సంవత్సరాల తర్వాత తమ తల్లితండ్రులు తిరిగి కలిసిపోవడం ఆనందంగా ఉందని.. వృద్ధాప్యంలో ఒకరికొకరు తోడు అవసరమన్నారు. తాము చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు మగతోడు లేకపోయినా తమ తల్లి ధైర్యంగా తమను పెంచి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి బాట వేశారని ఆమె చెప్పారు. రణధీర్‌కపూర్ కూడా బబితతో తిరిగి తన కలయిక గురించి మాట్లాడుతూ 'తిరిగి బబిత.. నేనూ కలవడం సంతోషంగా ఉంది.. మొదట్లో మా సంసారం అన్యోన్యంగా గడిచినా నేను తాగి వస్తానని బబిత నా మీద కోపంతో దూరం అయ్యింది.. మళ్ళీ ఇన్నాళ్లకు పిల్లలు మా ఇద్దర్నీ కలిపారు'.. అని సంతోషం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా 35 సంవత్సరాల ఎడబాటు తర్వాత రణధీర్‌కపూర్ దంపతులు తిరిగి కలిసిపోవడం పట్ల ఆయన అభిమానులు హర్షం వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం రణధీర్‌కపూర్ వయసు 78 సంవత్సరాలు.!

**- పరేష్ తుర్లపాటి**

# పులిని వేటాడే బెబ్బులి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ చారిత్రక చిత్రం హరి హర వీర మల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్ ట్రైలర్ ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మూడున్నర నిమిషాల ట్రైలర్ ఇవాళ విడుదలవగా, అభిమానులు, ప్రేక్షకుల్లో విపరీతమైన హైప్‌ను కలిగించింది. ట్రైలర్ మొత్తం పవన్ కల్యాణ్ యొక్క పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆసక్తికరంగా సాగుతుంది.

అర్జున్‌దాస్ వాయిస్ ఓవర్‌తో మొదలైన ఈ ట్రైలర్ గూస్ బంప్స్ ఇచ్చేలా ఉంది. ఇక పవన్ కల్యాణ్ వీర మల్లు అనే అప్రతిహత యోధుడిగా కనిపించడం మెయిన్ హైలెట్. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ముఘల్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచే కథనంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. బాబీ డియోల్ ఔరంగజేబ్‌గా భయానకమైన పాత్రలో కనిపించగా, కోహినూర్ డైమండ్ కోసం జరుగుతున్న పోరాటం నేపథ్యంగా వీర మల్లు, ఔరంగజేబ్ ల మధ్య జరిగే యుద్ధమే చిత్రానికి హైలైట్. యాక్షన్, విజువల్స్ బిగ్ స్క్రీన్ పై మరింత కిక్కిచ్చేలా ఉన్నాయి. పవన్ కల్యాణ్ లుక్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ.. అన్నీ కలిపి ఒక పవర్‌ఫుల్ యోధుడిగా తెరపై నిండుగా కనిపిస్తారని తెలుస్తోంది. "ఆంధి వచ్చేసింది" అనే డైలాగ్ ఒక్కటే అభిమానుల్లో గూస్‌బంప్స్ కలిగిస్తోంది. "అందరూ నేను రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తారు... మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు" అనే మరో డైలాగ్ కూడా ఆయన రాజకీయమైన ప్రస్తుత స్థితిని ప్రతిబింబించడంతో ట్రైలర్‌కు మరింత బలాన్ని తెచ్చిపెట్టింది. అలాగే పులిని వేటాడే బెబ్బులి అనే డైలాగ్ కూడా పవర్ స్టార్ ఇమేజ్ కు తగ్గట్టుగా ఉంది.

దర్శకుడు జ్యోతి క్రిష్ణ ఈ చారిత్రక చిత్రాన్ని మెగాస్కేల్‌లో రూపొందిస్తూ.. భారీ కాన్వాస్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో ప్రేక్షకులకు థియేట్రికల్ ఫీస్ట్ అందించనున్నట్లు అర్థమవుతుంది. ట్రైలర్‌లో కనిపించిన యుద్ధ సన్నివేశాలు, సనాతన ధర్మంపై ప్రధాన పాత్ర పోరాటం సినిమాలోని ప్రధాన బలంగా నిలవనున్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే, జ్యోతి క్రిష్ణ విజన్ పూర్తిగా గ్రాండ్ స్క్రీన్ అనుభూతిని ఇవ్వాలన్నదే. పంచమిగా నటించిన నిధి అగర్వాల్ పాత్ర కూడా ట్రైలర్‌లో ఆకట్టుకుంటోంది. సునీల్, భరణి లాంటి ప్రముఖ నటులు కూడా సినిమాలో ప్రత్యేకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. సినిమాటోగ్రాఫర్లు జ్ఞానశేఖర్ వీఎస్, మనోజ్ పరమహంసాలు కలిసిచేసిన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తోట తరణి వేసిన సెట్లు ముఘల్ కాలానికి తగినంత వైభవాన్ని చూపించగా, కీరవాణి సంగీతం ఎమోషన్‌కు అర్థం చెప్పే విధంగా సాగుతోంది. ప్రకాశం కేఎల్ ఎడిటింగ్ కూడా ట్రైలర్‌ను కట్టిపడేస్తోంది.

మొత్తంగా 'హరి హర వీర మల్లు' ట్రైలర్ బ్లాక్‌బస్టర్ ఫీల్ ఇచ్చే విధంగా ఉంది. పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే గ్రాండ్ చారిత్రక పాత్రగా నిలవబోతున్న ఈ సినిమా జూలై 24న థియేటర్లలో విడుదల కానుంది. ఈ ట్రైలర్‌తో పవన్ అభిమానులకు మాత్రమే కాకుండా, సాధారణ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు మొదలయ్యాయి. మరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**



## కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటూ వారి సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు గురువారం బలగలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమన్నారు. వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధికశాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే, వైకాపా నేతలు అర్థం లేని పనులు చేస్తున్నారని విమర్శించారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేశాం కాబట్టి ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు చింతల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ శీర రమణయ్య, శాంతినగర్ 7వ డివిజన్ ఇన్‌చార్జ్ రొక్కం భాస్కర్, వార్డు ఇన్‌చార్జులు, పట్టణ అధ్యక్షులు నాయకులు, రెడ్డి గిరిజశంకర్, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్, ఎస్పీలను కలిసిన పాత శ్రీకాకుళం సిరిమాను కమిటీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాత శ్రీకాకుళం సిరిమాను కమిటీ ప్రతినిధులు గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా పండుగల నిర్వహణలో వారు చూపిన చొరవ పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో అధ్యక్షులు డీపీ దేవ్, ముఖ్య సలహాదారు రామలింగేశ్వరస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శంకరరావు, కార్యదర్శి మావూరు శేఖర్, కల్లేపల్లి సోంబాబు, కర్రి రంగా జిదేవ్, అదపాక రాంబాబు, గంగు ఆదినారాయణ తదితరులు ఉన్నారు.





## సుపరిపాలన తొలి అడుగుకు నీరాజనాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుపరిపాలన తొలిఅడుగుకు ప్రజలు నీరాజనాలుపడుతున్నారని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఏయూ సిండికేట్ మాజీ సభ్యులు జామి భీమశంకర్ అన్నారు. గురువారం 44వ డివిజన్‌లో ఇంచార్జి కవ్వాడి సుశీల, బూత్ ఇన్‌చార్జి కవ్వాడి రవి, ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు కార్యక్రమాలు వివరించి అలాగే లబ్ధిదారులతో వారికి అందుతున్న పథకాలు, కూటమి ప్రభుత్వం సుపరిపాలన కోసం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌ల చొరవతో ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు.





శ్రీకాకుళం మండలంలోని శ్రీకాకుళం రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిల్లిపాలేం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలును హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , ఏ ఎన్ ఎం కె.ఢిల్లేశ్వరి, ఎం ఎల్ హెచ్ పీ సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## 15వ డివిజన్‌లో సుపరిపాలన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని 15 వ డివిజన్ కస్పా వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పొంద్రంకి శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శివపార్వతి, వైశ్యరాజు వెంకటలక్ష్మి, జామ్మా లక్ష్మి, పొంద్రంకి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ శాఖ – గ్రామీణ అభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గం అల్లివలస గ్రామంలో సుమారు రూ.15లక్షల అంచనా విలువ కలిగిన సిమెంట్ రోడ్లను గురువారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈ ఆర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లివలస గ్రామ ప్రజలు, రణ స్థలం మండల పార్టీ అధ్యక్షులు, ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి నాయ కులు తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## ఆమదాలవలసలో సుపరిపాలనలో తొలి అడుగు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస నియోజకవర్గ పరిధి ఆమదాలవలస మండలం లోని టి.జొన్నవలస గ్రామంలో కూటమి ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు మండల అధ్యక్షులు నూకరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల డిల్లీ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, గ్రామ టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అరసవల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 26వ డివిజన్ పరిధి అరసవల్లిలో నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించాలన్నారు. అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అడిగి తెలుసుకుంటున్నామన్నారు. వాటిని ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి మహిళకు ఉచిత గ్యాస్‌కు సంబంధించి ఏడాదికి మూడు ఉచిత సిలెండర్స్ అందిస్తున్నామన్నారు. అదే విధంగా తల్లికి వందనం పథకం కింద ఎందరు పిల్లలు చదివితే అందరికీ రూ.13వేల చొప్పున చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు రాయపిల్లి అర్జున్, ఉంగటి పాపారావు, దండాశి జ్యోతి భాస్కర్, ఉంగటి రామ్మోహన్, యూనిట్ ఇంచార్జ్ ఉంగటి పుష్ప బదాన నాయుడు, గురువు మురళి, డీసీఎంఎస్ నాయుడు, వివిధ సంఘాల నాయకులు, మహిళలు, పెద్దలు, యువత పాల్గొన్నారు.



## ఘనంగా జగన్నాథుడి అన్నదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


పట్టణంలో కంద్రపేటలో వెలసిఉన్న శ్రీ జగన్నాథుడి ఆలయం వద్ద రథయాత్ర లో భాగంగా గురువారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి మారుమూల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ పూజారి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పూజాలు నిర్వహించారు.



# అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను అందిస్తాం

(సత్యంన్యూస్, పాతపట్నం)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధి ఎల్ఎన్‌పేట మండలం చిన్న కొల్లివలసలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమాన్ని వివరించారు. అదే విధంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంక్షేమ పథకాలు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ వద్దు, జూట్ సంచులే ముద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

“ప్లాస్టిక్ కాలుష్యాన్ని” సమష్టి కృషి ద్వారా అరికడదామని, ప్లాస్టిక్ వద్దు, జూట్ సంచులే ముద్దని, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర గురువారం తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక సింధూర హాస్పటల్ ఆవరణతోపాటు, డే అండ్ నైట్ కూడలిలో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హానిపై అవగాహన కల్పిస్తూ జూట్ సంచులను అందించి మాట్లాడుతూ ప్లాస్టిక్‌లో ఎక్కువ భాగం సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలు వినియోగిస్తున్నారని, అవి భూమి, నదులు, సముద్రాల్లోకి చేరి పర్యావరణాన్ని కలుషితం చేస్తుందన్నారు. ప్లాస్టిక్‌తో భయంకరమైన అనేక రోగాలను కోరి తెచ్చుకుంటున్నామని, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వసంస్థలు, సామాజికసంస్థలు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలమన్నారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించి, పునర్వినియోగ పదార్థాలను ఉపయోగించి, పర్యావరణాన్ని రక్షించడానికి మనమంతా కలసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. లయన్స్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవి కుమార్, ఉపాధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులు, జనపనార గుడ్డ సంచులను వినియోగించాలని, వీటికి భూమిలో కరిగిపోయే గుణం చాలా ఎక్కువని, కనుక హానికారకం కాదని, రీసైక్లింగ్ పద్ధతిలో కొత్త వస్తువులు కూడా తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి బరాటం. కృష్ణ చైతన్య, వైస్ ప్రెసిడెంట్ ఉర్లం.శివతేజ పట్నాయక్, సభ్యులు పొడుగు. చరణ్, సింధూర హాస్పిటల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో 31 డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి పెద్ది కవిత ఆధ్వర్యంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలన, ఎమ్మెల్యే గొండు శంకర్ పనితీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పెద్ద కవిత తెలిపారు. కార్యక్రమంలో 156వ బూత్ ఇన్ ఛార్జ్ పెద్ది భరణి కుమార్ పాల్గొన్నారు

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే తదితర డిమాండ్లతో జూలై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, కర్షక సంఘాలు పిలుపునిచ్చారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు ట్రేడ్ యూనియన్ల జిల్లా స్థాయి సంయుక్త సమావేశం క్రాంతి భవన్ లో జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సి2+50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేయాలని కోరారు. రైతుల, వ్యవసాయ కార్మికుల, రైతుల రుణాలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కౌలురైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రైతు పెట్టుబడి సహాయం రూ.20వేలు వెంటనే విడుదల చేయలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్ట్ ఆదేశాల మేరకు కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి, లేబర్‌కోడ్‌ల అమలు వల్ల కార్మిక వర్గ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని, వెట్టి చాకిరీకి, బానిస విధానానికి కార్మిక లోకం బలైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ దేశవ్యాప్త సమ్మె భారత ప్రభుత్వానికి ఒక కనువిప్పు కలిగేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం 200రోజులకు, రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఉపసంహరించాలన్నారు. సెకీ, యాక్సిస్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వృత్తిదారుల హక్కులు కాపాడాలన్నారు. ధాన్యం, జీడి, కొక్, శనగ, మినుములు వగైరా పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కేటాయించి, కోనుగోలు చేయలన్నారు. కార్మికులు తమ పోరాటాల సాధించిన హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కార్మిక వర్గం తమ శక్తిని ఈ సమ్మె ద్వారా చాటాలని కోరారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల అనుకూల చట్టాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సమ్మె పురస్కరించుకొని గ్రామ, మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసన, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్‌రావు, కె.మోహన్‌రావు, పోలాకి ప్రసాదరావు, పి.తేజేశ్వరరావు, పొందూరు చందర్రావు, పి.పోలారావ్, డి.కృష్ణారావు, సాదు లక్ష్మీనారాయణ, బొత్స సంతోష్ తదితరులు హాజరయ్యారు.




ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666



# ప్రభుత్వ ఉపాధ్యాయులకు యాప్

# గుదిబండగా మారిందా?

**విద్యార్థులకు చదువు చెప్పడం కన్నా, పాలనా పరమైన బాధ్యతలు, బోధనేతర విధుల భారంతో సతమతమవుతున్నామని ఆంధ్రప్రదేశ్‌లో గవర్నమెంట్ టీచర్ల నుంచి కొన్నాళ్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే కారణంగా చూపిస్తూ నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలోని కోటితీర్థం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.మధుసూదన రావు ఉద్యోగానికి రాజీనామా చేయడంతో 'యాప్'ల భారమనేది మరోసారి చర్చనీయమైంది. ప్రభుత్వం యాప్స్, బోధనేతర కార్యక్రమాల పేరుతో టీచర్లను కట్టు బానిసల్లా మార్చేసింది. నాలుగైదేళ్లుగా విద్యార్థుల చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. 29 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడ లేదని మధుసూదనరావు తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. అయితే, ప్రభుత్వం వాదన మరోలా ఉంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితి మారిందని అధికారులు చెబుతున్నారు.**



నిరసన తెలుపుతున్న టీచర్లు (ఫైల్‌ఫోటో)

### బయోమెట్రిక్ నుంచి యాప్..

తొలుత వేలిముద్రతో అటెండెన్స్ నమోదు చేయడానికి ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ పరికరాలను ప్రభుత్వం ఇచ్చింది. తర్వాత కాలంలో వాటికి బదులు టీచర్లే తమ సొంత సెల్‌ఫోన్‌లో యాప్‌లను ఉపయోగించే విధానాన్ని తీసుకొచ్చింది. అలా మొదలై... ప్రతి పనికి ప్రత్యేకంగా ఒక్కో యాప్ వచ్చింది. రోజూ ఒక్కో యాప్‌లో లాగిన్ అవడానికి, సంబంధిత వివరాలు అప్‌లోడ్ చేయ డానికి ఎక్కువ సమయం పడుతోందని, దీనివల్ల బోధన కన్నా బోధనేతర పనుల భారం ఎక్కువైందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతుండేవి. దీంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయా యాప్‌ల్లో విధులన్నీ కేంద్రీకరిస్తూ 'లీప్' పేరుతో ఒకే యాప్‌ను తీసుకొచ్చింది. దీని నిర్వహణ బాధ్యత ప్రధానో పాధ్యాయులదే. కొందరు ప్రధానోపాధ్యాయులు మిగిలిన ఉపాధ్యాయులకు కూడా పనిభారం పంచుతున్నారు.

### యాప్ మారినా విధులు అవే..

తరచుగా సిగ్నల్ ప్రాబ్లమ్, ఒక్కోసారి సాంకేతిక సమస్యలతో యాప్‌లో టీచర్లు, విద్యార్థుల అటెం డెన్స్ అప్‌లోడ్ కూడా సమస్య అవుతోంది. ఐదు నిమిషాల్లో అయిపోవాల్సిన పనికి అరగంటకు పైగా పడుతోంది. ఆ సమయంలో టీచర్లకు టెన్షన్ తప్పట్లేదు. అటెండెన్స్ పడలేదని చూసుకుంటుంటే విద్యార్థులకు పాఠాలు చెప్ప లేరు. అలాగని వదిలేసి క్లాస్‌కు వెళ్లిపోతే ఒక్కోసారి అటెండెన్స్ వేయడమే మరిచి పోతున్నవారూ ఉన్నారు. దీనివల్ల పై అధికారుల ఆగ్ర హానికి గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే గతంలో పాఠశాలల్లో వివిధ అంశాలకు సంబంధించి 45కి పైగా యాప్‌లను ఉపయోగించేవారని, వాటిపై అభ్యంతరాలు ఉండేవని, ఇప్పుడు అనవసరమైన యాప్‌లను తొలగించామని, సింగిల్ యాప్ (లీప్) తీసుకొచ్చామని, ఇప్పుడు అన్ని సమస్యలు లేవని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఒకటే యాప్ అయినా పని భారంలో మార్పేమీ లేదంటున్నారు. బాత్‌రూమ్‌ల ఫోటోలు తీయడమనే పనిని తొలగించారు. అంతే తప్ప పెద్ద మార్పేమీ లేదు. గతంలోని 45 యాప్‌లతో ఏవైతే పనులు అప్పగించారో అవన్నీ ఇప్పుడూ సింగిల్ యాప్‌లోనూ యథావిధిగా కొనసాగుతున్నాయి.

### సింగిల్ టీచర్లకు అదనపు భారం

సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో బోధన, బోధనేతర విధులన్నీ ఒకరివే. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో ఈ తరహా పాఠశాలల సంఖ్య పెరిగింది. సింగిల్ టీచర్లతో పాటు పూర్తిస్థాయిలో విద్యార్థులున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి యాప్‌ల భారంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. బోధనేతర విధులకు సంబంధించిన యాప్‌ల నిర్వహణ తమకు తప్పించి, సచివాలయాల్లోని ఉద్యోగులకు అప్పగించాలనే వాదనలు ఉపాధ్యాయ వర్గాల నుంచి వస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల నుంచి వినతులు వెళ్లాయి.

బోధనేతర పనులు ప్రధానోపాధ్యాయులకు అదనపు భారమవుతున్నాయి. దీంతో యాప్‌లో ఫోటోలు, వివరాల అప్‌లోడ్ కోసం కొంతమంది ఉపాధ్యాయుల సహాయం తీసుకుంటున్నారు. వారేమో ఈ పనుల్లో పడి తరగతులకు సరిగ్గా వెళ్లలేకపోతున్నారు. బోధనకు ఆటంకం కలుగుతోంది.

ఈ సమస్యల దృష్ట్యా ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ డేటా ఎంట్రీ ఆపరేటర్ లేదా కంప్యూటర్ ఆపరేటర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, పెద్ద స్కూళ్లలో జూనియర్ అసిస్టెంట్‌లను







నియమించాల్సిన అవసరం ఉంది. అయితే యాప్‌లతో కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ఇప్పుడు ఒకే యాప్ ద్వారా పని సులభమవుతోందని విద్యాశాఖాధికారులు అంటున్నారు.

ఇప్పుడు ఒకటే యాప్ తీసుకొచ్చామని, ఒకే యాప్‌తో ఉపాధ్యాయులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా చాలా సులువైందని, అసలు దీంట్లో ఒత్తిడి ఫీల్ కావడానికి ఏముంటుందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఏ రోజు పని ఆ రోజు చేసుకోవడం, టైంకి వర్క్ చేయడం కూడా ప్రెజర్ అనుకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

### బోధనేతర విధులకే ఎక్కువ సమయం

జనగణన, విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలు, ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ విధులకు మాత్రమే ఉపాధ్యాయుల సేవలు ఉపయోగించుకునేందుకు విద్యాహక్కు చట్టం–2009 అనుమతిస్తుంది. వాస్తవానికి, ఉపాధ్యాయులు మొత్తం తమ వార్షిక పని గంటల్లో కేవలం 19.1 శాతం సమయాన్ని మాత్రమే బోధనకు కేటాయిస్తున్నారని, మిగతా సమయమంతా ఎన్నికల విధులు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, మధ్యాహ్న భోజనం రిజిస్టర్ల నిర్వహణ వంటి బోధనేతర విధులకే సరిపోతుందని పేర్కొంటూ 'డెక్కన్ క్రానికల్' ప్రచురించిన కథనాన్ని టీచర్లు ప్రస్తావిస్తున్నారు.

కర్ణాటక, ఒడిశా, గుజరాత్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో అధ్యయనం చేసి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (డీమ్డ్ యూనివర్సిటీ) విడుదల చేసిన నివేదికను ఆ పత్రిక ప్రస్తావించింది.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## దూసి రోడ్డు.. నరకానికి బోర్డు



(మొదటిపేజీ తరువాయి)

మారింది. కొత్తవలస, నారిపేట, ఇసుకలపేట, దిబ్బలపేట, తొగ రాం, కలివరం, ముద్దాడపేట, పీర్‌సాహెబ్‌పేట, దూసిపేట, దూసి, బావాజీపేట గ్రామాల మీదుగా వెళుతున్న ఆర్ అండ్ బి రోడ్డు దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. సుమారు 17వేలు జనాభా కలిగివున్న 11 గ్రామాలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెపండగ పేరుతో రోడ్ల మరమ్మతులకు నోచుకుంటాయని గ్రామ స్తులు ఆశించినా నిరాశ తప్పలేదు. కొత్తవలస, ముద్దాడపేట ఇసుక రీచ్‌ల నుంచి రోజూ వందలాది వాహనాలు అధిక లోడ్‌తో రాకపోక లు సాగిస్తుండడంతో రోడ్డు శిథిలమైందని స్థానికులు చెబుతున్నారు. వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతలుగా మారిపోయి నీరు, బురద చేరింది. దీంతో అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఆటోల్లో ప్రయాణం నరకయాతనగా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొగరాం నుంచి రాకపోకలు చేయడా నికి అవకాశం లేనంతగా రోడ్డు పాడైందని చెబుతున్నారు. ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు 12 కిలోమీటర్లు మేర రోడ్డు పూర్తి గా బురదతో నిండిపోవడం పట్ల ఆటోవాలాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూసి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా రోడ్డు నిర్మా ణం పూర్తి చేయడానికి ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు చొరవ చూపించాలని స్థానికులు కోరుతున్నారు.



## సమన్వయ లోపం
## సర్వేయర్ల బదిలీల్లో సందిగ్ధం!

(మొదటిపేజీ తరువాయి)

పోలీసుల బదిలీలు మినహా మిగతా అన్ని బదిలీల్లో పారదర్శకత కు పాతర వేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒక మండలంలో ఐదేళ్లు పూర్తిచేసుకున్నవారిని బదిలీ చేయాల్సి ఉండగా అధికారులు మాత్రం ఒక సచివాలయం పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారినే బదిలీ చేశారు. గత ఏడాది నిర్వహించిన బదిలీల్లో నాలుగేళ్లు పూర్తి చేసుకున్నవారు అదే మండలంలోని వేరే సచివాలయానికి బదిలీ అయ్యారు. వీరందరినీ బదిలీల నుంచి మినహాయించారు. కౌన్సె లింగ్ నిర్వహించినా కొన్ని ఖాళీలను ఉద్దేశపూర్వకంగా చూపించడం లేదు. దీనిపై కౌన్సెలింగ్ సమయంలో ఇంజినీరింగ్ సహాయకులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు ఉన్న వారిని, డబ్బులు ఇచ్చిన వారినే కోరిన చోటకు బదిలీలు చేశారన్న ఆరోపణ లు ఉన్నాయి. పలువురు మహిళా ఉద్యోగులు దూరప్రాంతానికి బదిలీ కాకుండా డబ్బు ముట్టజెప్పి మేనేజ్ చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. సిఫార్సు లెటర్లు తీసుకొచ్చినవారిని ముందు వరుస లో ఉంచి, లేనివారిని మూడు మండలాలను ఆప్షన్‌గా ఇచ్చి వెళ్లిపో వాలని అధికారులు సూచించిన పరిస్థితి కొన్ని శాఖల్లో ఎదురైందని విమర్శలు ఉన్నాయి. దీనివల్ల అధిక రోస్టర్ పాయింట్లు ఉన్న ఉద్యో గులు తీవ్రంగా నష్టపోయారంటున్నారు. ఖాళీ పోస్టుల వివరాలను బహిర్గతం చేయకుండానే బదిలీలు చేపట్టడంపై కూడా అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి.

## సమాజంలో బైక్ మెకానిక్‌ల బాధ్యత కీలకం




(సత్యంన్యూస్, రాజాం)

సమాజంలో బైక్ మెకానిక్‌ల పాత్ర కీలకమని రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్ డే సందర్భం గా రాజాం పట్టణంలో టూవీలర్ వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ మెకా నిక్‌లు బాధ్యతగా మెలగాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండా లని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలం చెల్లిన బైక్‌లను వినియో గించకుండా మెకానిక్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ద్విచక్ర వాహనం తీసుకొస్తే సమా చారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది బైక్ మెకానిక్‌లు పాల్గొని వారి ఐక్యతను చాటిచెప్పారు.



## రైతులకు విత్తనాల సమస్య రాకూడదు

- ఎరువులు సిద్ధం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతులకు విత్తనాలు సత్వరమే పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రైతులకు విత్తనాల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవ సాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువు లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వరి విత్తనాలు పంపిణీ గూర్చి కలెక్టర్ వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామిని అడుగగా, ఖరీఫ్‌లో ముఖ్య పంట అయిన వరి 33,622 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జెడి తెలిపారు. పచ్చిరొట్ట విత్తనా లు 1520 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వెయ్యి పచ్చిరొట్ట విత్తన కిట్లు పంపిణీ చేసి నట్లు వివరించారు. యూరియా, డిఎపి తది తర ఎరువులు ఖరీఫ్ సీజన్ నిమిత్తం 69.05 మెట్రిక్ టన్నులు కావలసిన అవస రం ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదన లు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా, డిఎపి వంటి ఎరువులు 13,495 మెట్రిక్ టన్నులు రైతుసేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటు లో ఉన్నట్లు చెప్పారు. మండలాల నుంచి ఎరువుల అవసరాలను సేకరించాలని కలె క్టర్ ఆదేశించగా, 2500 మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని ప్రతిపాదనలు వచ్చి నట్టు చెప్పారు. జిల్లాకు 38 రైతు డ్రోన్‌ల ఎఫ్ఎంబిలు గ్రౌండింగ్ లక్ష్యంగా పెట్టు కోగా, వీటిలో 31 సిహెచ్‌సి గ్రూపులకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూర య్యాయని, ప్రస్తుతానికి 10 సిహెచ్‌సి గ్రూపులు తమ 50 శాతం వాటాను జమ చేశాయని, 3 సిహెచ్‌సి గ్రూపులకు డ్రోన్‌లు సరఫరా చేయబడ్డాయని తెలిపారు. ఎపిఎం ఐపి ఉప సంచాలకులు శ్రీనివాసరావు ఎపి ఎంఐపి పంటల వివరాలను కలెక్టర్‌కు తెలు పగా, మండలాల వారీగా ఎంతమంది రైతు లను గుర్తించారో స్వయంగా వెళ్లి పరిశీ లించి వారం రోజుల్లో వివరాలు అందజే యాలని కలెక్టర్ ఆదేశించారు. పశుసంవ ర్ధక శాఖలి జెడి కె.రాజగోపాల్ మాట్లాడుతూ వ్యాక్సినేషన్ ప్రస్తుతం జరుగుతుందని తెలి పారు. జిల్లాలో మత్స్యకార సేవలో 15,584 మంది మత్స్యకారులకు ప్రభుత్వం అందించి నట్లు మత్స్యశాఖ ఉప సంచాలకులు సత్య నారాయణ వివరించారు. శ్రీకాకుళం మండ లం పెద్దగనగళ్లవానిపేట గ్రామం, కవిటి మండలం ఇద్దువానిపాలెం, వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామాల్లో వాతావర ణాన్ని తట్టుకోగలిగే తీర ప్రాంత మత్స్యకార గ్రామాలను గుర్తించి అక్కడ భవన నిర్మా ణాలు చేపడుతున్నట్లు చెప్పారు. క్లస్టర్ వారీగా 2987 చెరువులను ట్యాగ్ చేసినట్లు డిడి వివరించారు. జిల్లాలో కోల్డ్ స్టోరేజ్‌పై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి, మత్స్య శాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ, ఎపిఎంఐపి డిడి శ్రీని వాసరావు, పశుసంవర్ధక శాఖ జెడి కె.రాజ గోపాల్, వ్యవసాయశాఖ ఎడిలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి
## అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

**- రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకో వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వినతి పత్రం అందజేశారు. పలు గ్రామాల్లో అసంపూర్తిగా నిలిపోయిన అంగన్ వాడీ భవనాలు పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం వితంతు పింఛన్లు నిలిపివేసిందని, వాటిని మంజూ రుచేయాలని వినతి పత్రం అందజేయగా, ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి వితంతు పింఛన్లు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, చౌదరి బాబ్జి, నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.